విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం, 8 అక్టోబర్ 2025 | 8 పేజీలు

సమన్వయంతో పనిచేసి అభివృద్ధిని సాదిద్దాం

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మండలంలో సమన్వయంతో పనిచేసి అభివృద్ధిని సాదిద్దాం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం పెనగలూరు ఎంపిడిఓ కార్యాలయంలో ముక్కా సాయివికాస్ రెడ్డి అద్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ పైన స్థానిక ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు.ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీత వేసిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలని కోరారు.మండలంలో కోట్లాది రూపాయలతో అబివృద్ధి పనులు చేపట్టామన్నారు.ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించి పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, తహశీల్దారు డి అమరేశ్వరి, ఎంపిడిఓ విజయరావు,అర్ డబ్ల్యూఎస్ ఎఇ సునీత,కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేటుగాళ్లు

- తస్మాస్ జాగ్రత్త
- ఉద్యోగాల పేరిట టోకరా
- నిరుద్యోగ యువతను మోసగించిన వైనం..
- లబోదిబో మంటున్న బాధితులు

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి వారి నుండి రూ.లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు ఇరువురు ఎర్రగుంట్ల మండలానికి చెందిన వారు కావడం చర్చనీయాంశంగా మారింది. అధికార కూటమి శ్రేణులుగా గుర్తింపు పొందిన వీరు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల ఎరచూపి వారిని మోసగించిన నేపథ్యంలో బాధితులు లబోదిబోమంటున్నారు. జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓ పురపాలికకు చెందిన ఒకరు రూ.లక్షల్లో, ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మరొకరు రూ.కోట్లలో నిరుద్యోగ యువత నుండి సొమ్ము వసూలు చేసినట్లు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఓ పురపాలికకు చెందిన వ్యక్తి తిరుమల తిరుపతి దేవస్థానంలో (టిటిడి) రాయలసీమ ధర్మల్ విద్యుత్ కేంద్రంలో (ఆర్‌టిపిపి) ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలుకగా, గ్రామానికి చెందిన వ్యక్తి రైల్వే శాఖ, కియా (కార్లు) పరిశ్రమతో పాటు ప్రభుత్వ శాఖల్లో తాను ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని రూ కోట్లు దండుకున్నట్లు బాధితుల ద్వారా తెలుస్తోంది. సదరు వ్యక్తి అనంతపురం ప్రాంతానికి చెందిన కీలక వ్యక్తితో సంబంధాలు కొనసాగిస్తూ ఇలాంటి మోసాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఇక్కడి వ్యక్తి నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేసి కొంత మొత్తాన్ని అనంతపురం కీలక వ్యక్తికి ముట్ట చెపుతున్నట్లు తెలిసింది. కాలయాపన జరిగిన సమయంలో బాధితులు గట్టిగా ప్రశ్నిస్తే వారు ఇచ్చిన మొత్తం నుండి కొంత మేర తిరిగి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ దివంగత మాజీ ప్రతినిధి బంధువులు, స్నేహితుల నుండి కూడా ఉద్యోగాల పేరుతో భారీ మొత్తం వసూలు చేసినట్లు తెలిసింది. సదరు బాధితులు ఇతని మోసాన్ని గ్రహించి డబ్బు తిరిగి ఇవ్వాలని గట్టిగా కోరడంతో తన వద్ద డబ్బులు లేవంటూ తుదకు ఆవేదన వ్యక్తం చేసి రోదించినట్లు సమాచారం. సదరు వ్యక్తి గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తూ చాలామంది నిరుద్యోగులను దగా చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాలకు మునుపు అతి సామాన్యుడిలా ఉన్న ఈ వ్యక్తి ప్రస్తుతం విలాసవంతమైన జీవితం అనుభవిస్తూ కార్లలో తిరుగుతున్న వైనం కనిపిస్తోంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలతో తెర వెనుక సఖ్యత కొనసాగించి ప్రస్తుతం కూటమికి చెందిన వ్యక్తిగా కొనసాగుతుండటం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.

..మిగతా 2లో

మహోన్నతుడు వాల్మీకి మహర్షి

- పాడి రైతులకు అండ.. మినీ గోకులం

- ఎమ్మెల్యే ఆది, టిడిపి ఇన్చార్జి భూపేష్

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: రామాయణాన్ని మహాకావ్యంగా మలిచి భారత దేశ కుటుంబ వ్యవస్థ విధానాన్ని మహా గ్రంథంగా ఆవిష్కరించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి. ఆదినారాయణ రెడ్డి కొనియాడారు. మహర్షి జయంతిని పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన జమ్మలమడుగులో ఆయన విగ్రహానికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సి. భూపేష్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది వాల్మీకి రచించిన రామాయణ కావ్యం విశిష్టతను వివరించారు. అన్నదమ్ముల వాత్సల్యం, ప్రేమ, పితృవాక్కు పరిపాలకునిగా శ్రీరాముని చరిత్ర భారతదేశానికే కాక ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

..మిగతా 2లో

బాణాసంచా గోడౌన్లలో భద్రత నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు ఫైర్, భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ రూమ్ హాలులో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు.. తదితర అంశాలపై.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, డిఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్స్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్ లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. కమ్యూనిటీ ఓపెన్ ఏరియాలలో క్రాకర్స్ వినియోగించేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల్లో పిల్లలకు టపాసుల వినియోగం, భద్రతపై అవగాహన పెంచాలన్నారు. అలాగే ప్రజలందరూ సేఫ్టీ మేజర్స్ పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలన్నారు. అలాగే కమర్షియల్ టాక్స్ అధికారులు అన్ని డివిజన్లోని ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులతో సమావేశం నిర్వహించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. అలాగే అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ పర్మిషన్లు తదితర అంశాలపై సడన్ విసిట్లు నిర్వహించాలన్నారు.

..మిగతా 2లో

ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుపై వేటు

విశాలాంధ్ర-మెలకలచెరువు: ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందుపై వేటు పడింది. ములకల చెరువు కేంద్రంగా టీడీపీ నేతల నకిలీ మద్యం తయారీని గుర్తించడంలో అలసత్వం కారణంగా హిమబిందుపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ సీఐపై వేటు వేశారు. విజయవాడ ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసుకు హిమబిందును అటాచ్ చేస్తూ ఉత్తర్వులను మంగళవారం చేశారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిషోర్‌ను ములకలచెరువు ఎక్సైజ్ సీఐ బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

మురికి నీటితో దర్శనమిస్తున్న బస్టాండ్

విశాలాంధ్ర-పెద్దమండ్యం: మండలంలోని బ్రాహ్మణ వీధిలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇండ్లలోని వృధాగా పోతున్న నీరు బట్టలు ఉతికినవి స్నానాలు చేసిన నీరంతా రోడ్లపై వదులుతున్నారు. దీంతో రోడ్డు మొత్తం మురుగుమయంగా మారింది. ఆ వీధిలో ఎవరైనా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ వీధి నుంచి తంబళ్లపల్లి పెద్దమండెం రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తూ బస్టాండ్ వద్దకు చేరుతున్నది. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికులు సైతం తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల వద్ద కూడా ప్రజలు వెళ్లాలంటే మురుగునీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కావున దయవుంచి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులను కోరారు.

వాల్మీకి మహర్షి విగ్రహానికి జయంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: ఆదికవి, రామాయణ మహా కావ్యాన్ని లిఖించిన జ్ఞాననిధి వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలలో బాగంగా వాల్మీకి సంఘం అధ్యక్షు లు మండ్ల భక్తవత్సలం, సభ్యులు అధ్వర్యంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబుతో కలిసి బస్టాండ్ రోడ్డులో వాల్మీకి మహర్షి విగ్రహం దగ్గరికి విచ్చేసి విగ్రహానికి పూలమాల వేసి జయంతి శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండపల్లి మల్లికార్జున, ఉపాధ్యక్షులు, మండ్ల మన్మోహన్, మండ్ల సతీష్, ఆవుల పార్థసారథి, డాల్ సునీల్,బండపల్లి సాయిప్రతాప్, భోగ్యం నాగేంద్ర, మండ్ల రుపేష్, బేల్దారీ రమణ, శ్రావణ్, సుధా,రామయ్య,ఆటో మధు, శశిధర్, ప్రణీత్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో వాల్మీకి జయంతి



విశాలాంధ్ర-సిద్ధవటం: 11వ పోలీసు బెటాలియన్ భాకరాపేటలో కమాండెంట్ కె. ఆనంద రెడ్డి ఆదేశాల మేరకు 11వ పటాలములో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా 11వ బెటాలియన్ గౌరవ కమాండెంట్ ఆనంద రెడ్డి హాజరైనారు. ముందుగా కమాండెంట్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలంవేసి ఘనంగా నివాళులర్పించారు. కమాండెంట్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరు గల కవి అని రామాయణాన్ని రచించినటువంటి సుప్రసిద్ధ కవి. ఇతనిని ఆదికవిని కూడా పిలుస్తారు. అని చెప్పి కొనియాడినారు. కార్యాక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్/డి.ఎస్.పి కె వెంకట రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పాల్గొన్నారు.

దాతలే పాఠశాలకు పునాది లాంటివారు

- తెలుగుదేశం సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర-వీరబల్లి: ప్రతి పాఠశాలకు కూడా దాతలు సహకారం ఉంటే పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాటికుంట్ల శ్రీధర్ రెడ్డి కొనియాడారు మంగళవారం వీరబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల కూర్చోవడానికి టేబుల్స్ లేవని పదవ తరగతి పరీక్ష సమయంలో టేబుల్స్‌తో ఇబ్బందిగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య పలువురి నాయకులకు తెలియజేశారు వెంటనే తెలుగుదేశం సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి వెంటనే స్పందించి పాఠశాలకు గేటు సొంత నిధులతో వేయించారు పాఠశాలకు ఇంకా చాలా అవసరాలు ఉన్నాయని వాటిని కూడా దాతలు సహకారం ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వర్షం వస్తే పాఠశాల ఆవరణం పూర్తిగా వర్షపునీటితో నిండిపోతుందని దీంతో విద్యార్థులకు ఆటలకు చాలా ఇబ్బందికరంగా ఉన్నదని కావున దాతలు ఎవరైనా మట్టి తొలి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చేయాలని ఆయన కోరారు. వివేకానంద యూపీ స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు నాయకులు వెంకటేష్ నాయుడు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ బాధ్యతలు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర-కడప: కడప నగర శివారులలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణంలో సెక్యూరిటీ బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించాలని కడప రిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ రంగస్వామి తెలియజేశారు. నూతన ఏజెన్సీగా వచ్చిన ఈగల్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధి శంకర్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫామ్ ను మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ రంగస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిడి విజయలక్ష్మి, ఓ ఎస్ .సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకాలు, కుంకుమార్చణలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక అగస్త్యేశ్వర ఆలయంలో మంగళవారం నాడు ఆశ్వీయుజ పౌర్ణిమ శుభ దినము కావున ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి తెల్లవారుజామున నుండి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చణలు ఘనంగా నిర్వహించారు. అలాగే ఉదయం 6గంటలకు గోపూజతో ప్రారంభమై చండి మహా హోమములు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమీషనర్, ఆలయ ఈఓ కే.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అర్చక స్వాములచే ఘనంగా జరిగాయి.

దేశ న్యాయవ్యవస్థను అవమానించినట్టే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సుప్రింకోర్టు చీఫ్ జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై బూటు విసిరిన రాకేష్ కిశోర్‌ను తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ఇర్ఫాన్ బాష డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానంలోని ఈ దుర్మార్గక చర్య అత్యంత అవమానకరంగా ఉందని, అది సకల ప్రజల న్యాయ వ్యవస్థపై అవగాహణ కలిగిస్తోందని ఇర్ఫాన్ బాష పేర్కొన్నారు. సుప్రింకోర్టు ఆవరణలో ముఖ్య న్యాయ అధికారికి రక్షణ లేకపోయిన సంఘటన దేశం మొత్తానికే సంకేతంగా నిలవోచ్చు. ఈ ఘటన దళితుల వర్గం, ఇతర బలహీన వర్గాల పట్ల అసమానత్వ సమస్యలను మరింత తీవ్రం చేయొద్దని, రాజ్యాంగంలో కోరిన సమానత్వం అంబేద్కర్ సిద్ధాంతం సరిగ్గా అమలు కావాల్సిన అవసరం ఉన్నట్లు ఆయన హెచ్చరించారు.

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కొండాపురం: ఆంధ్రప్రదేష్ ఆశా వర్కర్ల యూనియన్(ఏఐటీయూసీ) కడప జిల్లా సమితి పిలుపు మేరకు కొండాపురంలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్స్, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ప్రభుత్వ వైద్యుడు సాంబశివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకులు ఇచ్చిన మాట ప్రకారం ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ సెలవులు ఇవ్వాలని, ఆశా వర్కర్లకు ప్రమోషన్లు కల్పించి ఏఎన్ఎంలుగా అవకాశం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, అనంతరం నెలకు 10వేల పెన్షన్ ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణిస్తే 10లక్షల రూపాయలు ఇవ్వాలని, దహణ సంస్కారాలకు 20000ఇవ్వాలని, పిహెచ్‌సి డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిని సమ్మె విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఇచ్చిన మాట ప్రకారం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళణ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, పి.వెంకటరమణ, ప్రసాద్, ఆశా వర్కర్ల ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, రాధ, అవిలేలు, సుజాత పాల్గొన్నారు.

కేటుగాళ్లు

మొదటి పేజీ తరువాయి

పురపాలికకు చెందిన వ్యక్తి ఓ నిరుద్యోగి నుండి రూ. 2.13 లక్షలు స్వీకరించి పిదప బాధితుడి ఒత్తిడి మేరకు కేవలం రూ. 4 వేలను ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు సమాచారం. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఓవైపు ప్రభుత్వం, మరోవైపు నియోజకవర్గ నేతలు పదేపదే చెబుతుండగా..ఈ ఇరువురు.. నేతాలకు గాని, మండలాల పర్యవేక్షకులకు గాని తెలియకుండానే ఈ మోసాలకు పాల్పడడం విమర్శలకు దారితీస్తోంది. అయితే బాధితులు ఎవరు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో మోసగాళ్లు సురక్షితంగా ఉండటం గమనార్హం.

మహోన్నతుడు వాల్మీకి మహర్షి

మొదటి పేజీ తరువాయి

భూపేష్ మాట్లాడుతూ భావితరాలకు తెలియజేసే ఉద్దేశంతో వాల్మీకి జయంతి వేడుకను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు.. పాడి రైతులకు అండ.. మినీ గోకులం.. పాడి పశువులు ఎండ, వానకు ఇబ్బంది పడకుండా మినీ గోకులాలు ఉపకరిస్తున్నాయని ఎమ్మెల్యే ఆది, ఇన్చార్జి భూపేష్ స్పష్టం చేశారు. జమ్మలమడుగు మండలం అంబవరం గ్రామంలో మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఆసక్తి ఉన్న పాడి రైతులకు రాయితీపై వీటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని వారు గుర్తు చేశారు. ఆయా కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, వాల్మీకి సోదరులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణాసంచా గోడౌన్లలో భద్రత నిబంధనలు పాటించాలి

మొదటి పేజీ తరువాయి

ఎక్కడైనా ఇల్లీగల్ స్టోరేజ్ పాయింట్లు కనపడితే వెంటనే వాటిని సీజ్ చేసి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే లోకల్ క్రాకర్స్ తయారీ వంటి వాటిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 102,మెడికల్ క్యాంపులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్,సాయి శ్రీ,చెన్నయ్య జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ ,మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్తలు వైఎస్సార్, జగనే

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సంక్షేమ పథకాల సృష్టికర్తలు డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి అని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచమల్లు మాట్లాడుతూ ఆటో కార్మికుల కష్టాలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా ఉండబడిన ఆటో కార్మికులను ఆదుకోవడం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాహణ మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పేరు మార్చి 'ఆటో సేవలో' అంటూ ఆటో కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 13లక్షల మంది ఉండగా కేవలం 3లక్షల మందికి ఒక్కో ఆటో కార్మికునికి 15వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణం అన్నారు. ప్రొద్దుటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో 1549మందికి లబ్ది చేకూరిందని, తెలుగుదేశం పార్టీ హయాంలో 1562మందికి ఇచ్చారని, ఏడాదిన్నర కాలంలో కేవలం పెరిగింది 13మంది ఆటో కార్మికులేనా అని ఆయన ప్రశ్నించారు. ఆటో కార్మికులకు ఇచ్చే పథకంలో కూడా ఆంక్షలు విధించారని అన్నారు. కేవలం రోజుకు 40రూపాయలు మాత్రమే ఆటో కార్మికులకు లబ్ది చేకూరుస్తూ పండుగ చేసుకోండని గొప్పలు చెప్పడం చంద్రబాబుకే చెల్లు అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, కంభం వెంకటేశ్వర్లు, చౌడం రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే వాల్మీకుల సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సమిష్టి ఐక్యతతోనే వాల్మీకుల సమస్యలు పరిష్కారం కాగలవని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని మైదుకూరు రోడ్డులోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పెత్తఎత్తున ద్విచక్ర వాహణాల ర్యాలీ బయలుదేరి ఆర్టీసి బస్టాండు, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డులోని సమావేశం మందిరానికి చేరుకున్నారు. నల్లబోతుల నాగరాజు మాట్లాడుతూ వాల్మీకులు ఎంతో మంది ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఉన్నప్పటికి కుల సంఘం లేకపోవడంతో వాల్మీకుల ఇబ్బందులు గుర్తించలేకుండా పోతున్నారని అన్నారు. వాల్మీకుల కులంలో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు. కుటుంబ పరంగా విద్యాపరంగా, ఆరోగ్య పరంగా ఎవరయితే ఇబ్బందులు పడుతున్నారో వారిని ఆదుకోవాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందన్నారు. వాల్మీకి సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, మండ్ల మల్లికార్జునలు మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలన్నది వాల్మీకి బోధించారని గుర్తు చేశారు. చల్లా రాజగోపాల్, బొర్రా రామాంజినేయులు మాట్లాడుతూ బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు. సాకే ఆదినారాయణ, మద్దిలేటి తదితరులు పాల్గొని ప్రసంగించగా పెద్దఎత్తున వాల్మీకులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ మొబైల్ ఫోన్ వినియోగాలపై అవగాహన

విశాలాంధ్ర-మైదుకూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నందు మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణా రెడ్డి విద్యార్థినులకు సోషల్ మీడియా ఇంటర్నెట్ మొబైల్ ఫోన్ వినియోగాలపై అవగాహన కల్పించడం అయినది. అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయం అయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అలాంటి పరిచయాలని నిజమైనవి కాదని తెలపడం అయినది. అలాగే ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించడం అయినది.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం

- 'సీమ వైభవాన్ని ఆవిష్కరించే విశిష్ట గ్రంథం' - ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: మహోజ్వలమైన రాయలసీమ వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వైభవాన్ని చాటి చెప్పడానికి 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం' అనే పేరుతో త్వరలో ఒక విశిష్టమైన గ్రంథాన్ని ఆవిష్కరించబోతున్నట్లు వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం వారి ఆధ్వర్యంలో ఈ పుస్తక ప్రచురణ జరుగుతున్నదని, రాయలసీమకు సంబంధించిన సాహిత్యాన్నంతా సాహిత్య ప్రక్రియల కనుగుణంగా అధ్యయనం చేసిన ప్రసిద్ధ కవులు, పండితులు, అవధానులు, విమర్శకులు, నాటక కర్తలు, కథకులు, నవలాకారులు, పరిశోధకులు మొదలైన వారితో ఈ గ్రంథానికి పరిశోధనాత్మకమైన వ్యాసాలు వ్రాయించినట్లు చెప్పారు. రాయలసీమ భౌగోళిక స్వరూపంతో మొదలైన ఈ గ్రంథంలో రాయల సీమ ప్రాచీన సాహిత్యం, పౌరాణిక , దేశీ, జానపద సాహిత్యాలు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య, విశ్వకవి వేమన, కాలజ్ఞాని వీరబ్రహ్మం, శతక, అవధాన సాహిత్యాలు, రాయలసీమ భాష, బాల సాహిత్యం, నాటకం, చారిత్రక పద్య కావ్యాలు, సాహిత్య విమర్శ, ఆధునిక పద్య కావ్యాలు, ఆధునిక వచన కవిత్వం, అభ్యుదయ సాహిత్యం, రాయలసీమ పత్రికల ప్రస్థానం, కవయిత్రులు, రాయలసీమ నుండి వచ్చిన నవల, కథా సాహిత్యాలు, సంస్కృతి సంప్రదాయాలు, జానపద కళా వైభవం, ప్రసిద్ధ ఆలయాలు మొదలైన విలువైన వ్యాసాలు చోటుచేసుకున్నాయన్నారు. తొలి ప్రాచీన తెలుగు కవి నన్నెచోడుడు మొదలు నిన్న మొన్నటి పుట్టపర్తి నారాయణాచార్యులు వరకు వందలాది మంది కవులు తెలుగు సాహితీ ప్రపంచం లో అద్భుతమైన కావ్యాలు రాసి చిరస్మరణీయమైన స్థానాన్ని అలంకరించారని, ఆధునిక కాలంలో సాహిత్యానికి సంబంధించిన ప్రతి ప్రక్రియలో రాయలసీమ తన అస్తిత్వాన్ని నిలుపుకుందని, ఇంత గొప్ప చరిత్ర కలిగిన రాయలసీమ సాహిత్యాన్ని అక్షర బద్ధం చేయడం మనందరి బాధ్యతని ఆయన గుర్తుచేశారు. ఈ గ్రంథ ప్రచురణ లో వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘ కార్యవర్గం అందిస్తున్న సహాయ సహకారాలకు అభినందనలతో కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూస్ రీల్

సుప్రీం జడ్జిపై దాడి హేయం

విశాలాంధ్ర-పీలేరు: సుప్రీం జడ్జిపై దాడి హేయమైన చర్య అని పీలేరుకు చెందిన తుమ్మల ధరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పీలేరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాని కి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. న్యాయమూర్తి పై దాడి అంటే రాజ్యాంగంపై దాడిగానే పరిగణించాలన్నారు. దాడిని ఖండిస్తూ ప్రజా సంఘాల నాయకులు కళ్ళకు గంతలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు పఠాన్ మౌలా, శ్రీనివాసులు, సుభాష్, సుధాకర్‌బాబు, నరసింహులు, వెంకటేష్, మల్లికార్జున, గటప్ప, శ్రీకాంత్, విజయ్‌కుమార్, గురునాథం, రవీంద్ర, చరణ్, పురుషోత్తం పాల్గొన్నారు.

జడ్జిపై దాడి దుర్మార్గం

విశాలాంధ్ర-కలికిరి: పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ముందర ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ జేఏసీ ఆధ్వర్యంలో జడ్జిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్న కుల వివక్షత వెంటాడుతూ ఉంటుందనటానికి ఈ రోజు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయిపై ప్రత్యక్షంగా తన చెప్పుతో దాడి చేయాలని ప్రయత్నించటం అనాగరికత, చదువుకున్న నిరక్షరాసుడు ఎంతటి అఘాయిత్యానికి పాల్పడటం దుర్మార్గం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నాయకులు గోవమ్మ, యుగంధర్, సామ్యూల్, భానుప్రకాష్, బావాజీ, సయ్యద్, షాహిద్‌బాషా, రమేష్, రఘు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాల్సిందే

విశాలాంధ్ర- పీలేరు: వాల్మీకుల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చా ల్సిందేనని ఈ సంఘం ముఖ్య నాయకులు గుండ్లూరు మురళి, రెడ్డప్ప, వెంకటరమణ, చంగల్ రాయులు డిమాండ్ చేశారు. మంగళవారం పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణంలో వాల్మీకి మహర్షి జయంతి వే డుకలను నిర్వహించారు. వాల్మీకి మహర్షి జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ నేత సుధాకర్ బాబు, గురు మోహన్, వెంకటరమణ, మురళి, శీనా, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మురళి పాల్గొన్నారు.

యాష్ ఇబ్బందులపై జెన్కో డైరెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: ఇక్కడి రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి (ఆర్‌టిపిపి) అధికంగా యాష్ వెలువడుతోందని, ఈ కారణంగా ఉద్యోగులు, కార్మికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారని 1535 యూనియన్ నాయకులు ఏపీ జెన్కో థర్మల్ డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు యూనియన్ నాయకులు మంగళవారం పరిశ్రమలోని విఐపి అతిథి గృహంలో డైరెక్టర్‌ను కలిశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, అడిషనల్ సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి, రీజనల్ సెక్రటరీ రమణయ్య, రీజనల్ ప్రెసిడెంట్ ఆర్ జనార్ధన్ రెడ్డితో పాటు చంద్రశేఖర్ రెడ్డి, మల్లు జనార్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చెన్నకేశవులు, మధుసూదన్ రావు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

- జెన్కో డైరెక్టర్‌కు కలమల్ల వాసుల వినతి

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఆర్‌టిపిపి)600 మెగావాట్ల యూనిట్ నుండి విడుదల అవుతున్న రిజెక్టెడ్ కోల్ (ప్రమాదకరమైన విషవాయువు) కాలుష్యాన్ని నియంత్రించాలని, కెమికల్ నీటిని శుద్ధి చేసిన పిదప ప్లాంటేషన్ కు వినియోగించాలని జెన్కో డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డికి కలమల్ల గ్రామ ప్రజలు విన్నవించారు. గ్రామస్తులతో అధికారులు సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. 600 యూనిట్ ప్రధాన ద్వారం ఎదురుగా టిప్పర్లు, ట్యాంకర్లు పార్కింగ్ కారణంగా గ్రామస్తులు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని డైరెక్టర్ కు తెలియజేశారు. బూడిద, శబ్ద కాలుష్యంతో ప్రజల దైనందిన జీవితం తలకిందులవుతోందని గ్రామస్తులు వాపోయారు. భూ నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరారు. కలమల్ల నుండి మేకల బాలాయపల్లె వరకు వంకలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టాలని కోరారు. కలమల్ల వంకలో పేరుకుపోయిన జమ్మును తొలగించాలని విన్నవించారు. అధిక టన్నేజీ ఫ్లయాష్ బూడిద రవాణాను అరికట్టి ప్రమాదాలను నివారించాలి. పరిశ్రమ వద్ద నుండి చిలంకూరు క్రాస్ రోడ్డు వరకు వీధి దీపాల మరమ్మత్తు పనులు క్రమంతప్పకుండా చేపట్టాలి. పరిశ్రమ పరిసర రోడ్ల కు ఇరువైపులా పేరుకుపోయిన బూడిద కుప్పలను తొలగించాలి. ప్రతిరోజు మూడుసార్లు రోడ్లపై ట్యాంకర్ల ద్వారా నీరు చల్లించి బూడిద కాలుష్యాన్ని నియంత్రించాలి. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి. 600 యూనిట్‌లో స్థానిక యువతకు అవకాశం కల్పించి ఖాళీలను భర్తీ చేయాలి. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ప్రజాస్వామ్య వాదులను కలుపుకొని ఆందోళన చేపడతామని కలమల్ల గ్రామస్తులు హెచ్చరించారు.

ఆదికవి వాల్మీకి అందరివాడు: డాక్టర్ తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ఆదికవి వాల్మీకి, జగద్గురు ఆదిశంకరాచార్య గొప్ప కవులు, తత్వవేత్తలు, ఆరాధ్యనీయులని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. వాల్మీకి గొప్ప ఋషి ,మహర్షి ,తత్వవేత్త ,కవి అని తులసి రెడ్డి అన్నారు. ఆశ్వీజ పౌర్ణమి ఆయన పుట్టినరోజు అన్నారు. సంస్కృత భాషలో ఏడు కాండాలు, 24వేల శ్లోకాలతో ఆదికావ్యమైన సంస్కృత రామాయణాన్ని ప్రపంచానికి అందించిన ఆదికవి వాల్మీకి. ఒక ఆదర్శ మానవుడు అన్నారు. ఆయన జీవించింది కేవలం 32 సంవత్సరాలు మాత్రమే. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు నరెడ్డి అలివేలమ్మ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, బందారు వెంకటేశు, బ్యాంకు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిజేఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- వీసీకే పార్టీ రాష్ట్ర నేత పీటీయం శివప్రసాద్

విశాలాంధ్ర-మదనపల్లి: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పైకి చెప్పు విసిరి, అవమానించిన సంస్కారహీనమైన న్యాయవాది చర్యను, విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. మత ఉన్మాదం తలకెక్కిన ఆ న్యాయవాది యొక్క న్యాయవాద వృత్తి అనుమతిని తక్షణమే రద్దు చేసి, యూఏ పిఏ చట్టం కింద అతన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటన సంఘ్ పరివార్ గుంపుల మత ఉన్మాద చర్యలకు పరాకాష్టగా ఉందని అభిప్రాయ పడ్డారు. విప్లవ నాయకుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలను అనుసరించే ప్రజాస్వామ్య శక్తుల ప్రతినిధి అయిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఇంత ద్వేషపూరిత చర్యకు పాల్పడటం చూసి, ప్రపంచం నెవ్వరపోతోందని చెప్పారు. కేంద్రం ఆ నాయవాదిని తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని శివప్రసాద్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. నాయకులు రమణ, రెడ్డెప్ప, రమణ, శ్రీనివాసులు, గంగులప్ప, రవిశంకర్, కృష్ణ, రెడ్డిప్రసాద్, శంకర్, చంద్ర పాల్గొన్నారు.

అయ్ఆస్ రాష్ట్ర అధ్యక్షులుగా సత్తార్ ఫైజి ఎంపిక

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఆలిండియా అదబ్ ఎ అత్ఫాల్ సొసైటీ (అయ్ఆస్) జాత య బాల సాహితి సొసైటీ న్యూ ఢిల్లీ అధ్యక్షులు డాక్టర్ సి.నద్వీ ప్రధాన కార్యదర్శి మహ మ్మద్ సిరాజ్ అజీం మంగళవారం ఉదయం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి రాష్ట్ర బాల సాహితి సొసైటీ అధ్యక్షులుగా ప్రముఖ ఉర్దూ బాల సాహితి వెత్త సత్తార్ ఫైజిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సత్తార్ ఫైజి స్కూల్ అసిస్టెంట్ ఉర్దూగా సి. కె.దిన్నె మండలం మూలవంక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల నవంబర్ 11, 12, 13తేదీల్లో మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలో "జష్నే రంగే బచ్పన్" పేరుతో అంతర్జాతీయ ఉర్దూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు అంతర్జాతీయ సెమినారు, ముషాయిరా, బాల సాహితి ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, ఉర్దూ నాటికలు, ఉర్దూ పుస్తకాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ విశ్వవిద్యాలయాలో నిర్వహించనున్నారని తెలిపారు. దేశ విదేశాల నుండి ఉర్దూ బాల సాహితి వెత్తలు కవులు రచయితలు విమర్శకులు ఆచార్యులు అధ్యాపకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

రాజంపేటలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రాజంపేట: పట్టణంలోని బైపాస్ రోడ్‌లో మంగళవారం వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద వాల్మీకి జయంతి వేడుకలు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నల్లబోతుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాంనగర్ నుంచి రమేష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున వాల్మీకి యువకులు వాల్మీకి చిత్రపటంతో డప్పు వాయిద్యాల మధ్య చిత్రపటాన్ని ఊరేగిస్తూ వాల్మీకి విగ్రహం వరకు చేరుకున్నారు. అనంతరం మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు,బోయపాలెంలో వాల్మీకులు ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని భక్తులకు అందజేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ముందుగా వాల్మీకులు ఇటీవల వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిలింగ్ మెంబర్గా ఎన్నికైనటువంటి పోలా శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ధర్మాన్ని ఎలా రక్షించాలో వాల్మీకి మహర్షి తన రామాయణం ద్వారా ప్రజలకు అందించారన్నారు. నల్లబోతుల శంకరయ్య, మండ్ల శ్రీహరి,నాగ గణేష్, నాగరాజా, నరసింహ, వినోద్, రాంనగర్ రమేష్, సాయి, వంశీ, నాని, ధర్మన్న, ఆదినారాయణ, వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి గర్హనీయం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: దేశ అత్యున్నత న్యా యస్థానం సుప్రీంకోర్టులో సోమవారం సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై సనాతన ధర్మం పేరుతో రాకేష్‌కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడి చేయడం అత్యంత దుర్మార్గం, దురదృష్టకర మని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రతి ప్రజాస్వామ్య వాది, ప్రతి భారతీయుడు ఈ చర్యను ఖండించాలి. నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.

జీఎస్టీ అంశంపై వ్యాచ రచన పోటీలు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తగ్గించిన జీఎస్టీ వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలపై, వ్యాచరచనపై, చిత్రలేఖనంపై మంగళవారం అనంతరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ లో చదువుచున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలుగు మాష్టారు సుబ్రమణ్యంరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. పిడి సుదర్శన్ రెడ్డి, హిందీకుమార్, సుధ, ప్రకాష్ రాజునాయక్, పంచాయితీ సెక్రటరీ హరిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో ఎన్నో ప్రయోజనాలు

విశాలాంధ్ర-మైలవరం: జిఎస్టి 2.0 ద్వారా వినియోగదారులకు పన్ను తగ్గి కొనుగోలు సామర్థ్యం పెరుగుతుందని ప్రొద్దుటూరు డిప్యూటీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బాబుల్ రెడ్డి అన్నారు మంగళవారం ఉదయం మండలంలోని దొమ్మర నంద్యాల ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అనే నినాదం ద్వారా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ ఫోటోలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు నరసమ్మ తెలిపారు.

ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-సిద్ధవటం: సిద్ధవటంలోని ప్రభుత్వ బిసి బాలుర బాలికల వసతి గృహాలను అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి మహాలక్ష్మి మంగళవారం తనిఖీలు చేపట్టి పలు రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో మౌలిక వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు ప్రతి విద్యార్థి అటెండెన్స్ కచ్చితంగా ఉండాలని వసితి గృహాలలో విద్యార్థుల ముఖచిత్ర అటెండెన్స్ త్వరలో అందుబాటులోకి వస్తుందని టాయిలెట్ బాత్రూమ్స్ శుభ్రంగా ఉండేటట్టు చూడాలన్నారు. వసతి గృహముల అధికారులు ప్రసాద్,రఘురామరాజు,శారదపాల్గొన్నారు.

కష్యప గరుడ పథకాలు అమలుకు చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-పులివెందుల: రాష్ట్రంలో అనేక మంది బ్రాహ్మణులకు ఉపయోగపడే కష్యప గరుడ పథకాలు వెంటనే అమలు చేసేలా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పాలక మండలి చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీఎస్‌వి ప్రసాద రావు. సూగురు రఘునాథరావులు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరుడ పథకం ఎంతో మంది పేద బ్రాహ్మణలకు ఉపయోగ కారి అని గత 4సంవత్సరాలనుండి ఒక్కరికి ఈ పథకం ద్వారా ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదని కనీసం 2024జూన్ నెల నుండి అయిన పెండింగ్ లో వున్న దరఖాస్తు లను పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలన్నారు. ఈ పథకం కింద మంజూరు చేసే 10000రూపాయలు 2015వ సంవత్సంలో నిర్ణయించారాని ప్రస్తుత పరిస్థితి లో 20000 రూపాయలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సర కాలం నుండి కార్పొరేషన్ కు బాద్యులు లేక పోవడం తో

బ్రాహ్మణులు ఎవరిని అడగాలో తెలియక ఆందోళనతో వున్నారని నేడు పాలక మండలి ఏర్పాటు కావడంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ఇటీవల అరంతపురం జిల్లా నార్పల మండలంలో ఒక బ్రాహ్మణుడు అతని కుటుంబ సభ్యులు చని పోతే ఖర్చులకు డబ్బులు లేక బంధువులు సమాచారం ఇవ్వకుండా ఆటో లో తెచ్చి దహన సంస్కారాలు చేశాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు అన్నారు. గరుడ పథకం ఉన్నా ధైర్యం చెప్పే వారు లేక వస్తుందో రాదో తెలియక ఆ బ్రాహ్మణుడు ఒక్కడే కార్యక్రమం ముగించారాని ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా వెంటనే గరుడ పథకం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. బ్రాహ్మణ జాతికి అండగా ఉంటారని ప్రభుత్వం పదవులు ఇచ్చారని దానిని సార్థకత చేయాలని కోరారు. అదే విధంగా గతం లో కార్పొరేషన్ అమలు చేసిన కశ్యప పథకం కూడా ఎంతో మంది పేద వృద్ధ బ్రాహ్మణ కుటుంబాలకు అండగా ఉంటుందని దానిని అమలు చేయడానికి చర్చించడానికి బ్రాహ్మణ సంఘాలుతో సమావేశం నిర్వహించాలని సూచించారు. బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయించిన మొత్తం లోతల్లికి వందనం పథకం డబ్బులు మినహాయించి మిగిలిన మొత్తం ప్రభుత్వం నుండి తెచ్చుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.బ్రాహ్మణ జాతి కి ప్రతినిధులు గా ప్రభుత్వం పాలక మండలి ని నియమించినదని ప్రభుత్వ ఆశయం నెరవేర్చి బ్రాహ్మణ జాతిని పార్టీకి దగ్గర చేయాలనీ కోరారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్: సర్పంచ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: మన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు వివరించాలని ఉద్దేశంతో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌ను ప్రవేశపెట్టిందని, పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పట్టణంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ వివరించారు. అన్ని రకాల వస్తువులపై 5% నుండి18% వరకు జిఎస్టి తగ్గించిన కారణంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వివరించారు. ప్రజలు రోజువారిగా ఉపయోగించే వస్తువులపై 0% నుండి 5% ఇప్పుడు ప్రధానంగా 2 పన్ను స్లాబులు మాత్రమే.

రామచంద్రయాదవ్‌పై పోలీసుల తీరు దారుణం

విశాలాంధ్ర-వేంపల్లి: భారత చైతన్య యువజ న పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నిర్మల యాద ాવ్ ఖండించారు. ఆమె మాట్లాడుతూ అనకా పల్లి జిల్లా రాజయ్యపేట రైతులకు మద్దతుగా రామచంద్ర యాదవ్ వెళ్లే క్రమంలో రాజమండ్రి హెరిటల్ నందు పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. రైతులకు మద్దతు ఇవ్వటం నేరమా అని ప్రశ్నించారు. డ్రగ్ కంపెనీకి ప్రభుత్వం రైతుల భూములను కట్టబెట్టాలని యత్నం చేస్తుంటే రైతులు డ్రగ్ కంపెనీకి వ్యతిరేకంగా భూములు ఇవ్వబోమని ఉద్యమం చేస్తుంటే రైతులకు మద్దతు ఇవ్వడానికి వెళ్తున్న రామచంద్ర యాదవ్ ను అడ్డగించి ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ రైతులు ఉద్యమం చేస్తుంటే రామచంద్ర యాదవ్ ప్రత్యక్షమై ఉద్యమంలో పాల్గొనటం చూసి ఓరువలేని కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రామచంద్ర యాదవ్‌ని ఇబ్బందులకు గురిచేయడం క్షమించరాని నేరమన్నారు. రామచంద్ర యాదవ్ ఉద్యమ స్ఫూర్తిని చూసి ప్రభుత్వం భయపడుతుందని

అలాంటప్పుడు రైతు వ్యతిరేక చర్యలు ఎందుకు చేపడుతుం దని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోజురోజుకు రామచంద్ర యాదవ్ పట్ల రాష్ట్రంలోని రైతులందరూ కృతజ్ఞతలు తెలుపుతూ రైతుల పక్షపాతి రామచంద్ర యాదవ్‌ని అభివర్ణిస్తున్నారని అలాంటి రామచంద్ర యాదవ్ పట్ల ప్రభుత్వం పోలీసుల ద్వారా అణిచివేయాలని చూస్తే రైతులందరూ ఏకమై కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పేకిలించివేస్తారని నిర్మల యాదవ్ హెచ్చరించారు. రామచంద్ర యాదవ్ ఉన్నటువంటి లాడ్జి దగ్గర ఓవరాక్షన్ చేసినటువంటి పోలీసుల అధికారులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీసీవై పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

మృతురాలు సుబ్బమ్మకు నివాళులు అర్పించిన ఇఓ

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలోని శ్రీగండి వీరాంజనేయ స్వామి ఆలయంలో పని చేస్తున్న మల్లెల సుబ్బరాయుడు తల్లి సుబ్బమ్మ ఆఖస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆలయం ఇఓ వెంకట సుబ్బయ్య, ఛైర్మెన్ వెంకటస్వామి, సూపరింటెండెంట్ సుభాష్, స్టాఫ్ వచ్చి మృత దేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మృతి చెందడం భాదాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. సుబ్బరాయుడుకు మేము అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. బందువులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

మూతబడ్డ రైతు భరోసా కేంద్రాలు

విశాలాంధ్ర-వీరబల్లి: వీరబల్లి మండలం గురప్పగారి పల్లె పంచాయతీ నందు సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను 2గంటల 50 నిమిషాలకే సిబ్బంది తాళాలు వేశారని గ్రామస్తులు తెలిపారు పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గుర్రప్ప గారి పల్లి.. సచివాలయం, రైతు భరోసా కేంద్రాల అధికారులు సమయపాలన పాటించకుండా విధులకు డుమ్మా కొడుతున్నారు. అవసరాలకు వచ్చిన ప్రజలు కార్యాలయాల వద్దకు వచ్చి వెలుతిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం సచివాలయం, రైతు భరోసా కేంద్రం వద్దకు మధ్యాహ్నం అవసర నిమిత్తం రాగా కార్యాలయాల్లో సిబ్బంది ఎవరూ లేకపోవడం, తాళాలు వేసి ఉండడం చూసి తిరిగి ఇంటికి వెళ్లి పోయారు. సచివాలయాల్లో

అరకురా సిబ్బంది ఉన్న ఇలా విధుల సక్రమంగా నిర్వర్తించుకోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల చర్యలు తీసుకొని సమయపాలన పాటించని, విధులకు డుమ్మా కొట్టిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో జవహర్ బాబును వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థి

విశాలాంధ్ర-వీరబల్లి: వాల్తేరు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లి పెద్దూరు విద్యార్థి పెద్దివీటి పవన్‌కుమార్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లూరు జయన్న మరియు ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్యలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పెద్దివీటి పవన్ కుమార్ ను అలాగే పిడి జగదీశ్వరయ్య ను అభినందిస్తున్నట్లు వారు తెలియజేశారు .పాఠశాల పిడి జగదీశ్వర్య ప్రతిరోజు పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులతోసెలవు దినాలలో కూడా పాఠశాల కు వచ్చి బాగా ప్రాక్టీస్ చేయించారని

ఆ కారణంగా నే మా విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు ఇలాంటి అంకిత భావం గల ఉపాధ్యాయులు పాఠశాలకు అవసరమని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా పవన్‌కుమార్‌ను, పిడి జగదీశ్వరయ్యను అభినందించారు.

విజయవంతంగా క్రీడా పోటీలు

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం లో రెండు రోజులు నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ మండలస్థాయి టోర్నమెంట్, సెలక్షన్స్ విజయవంతంగా ముగిశాయి. బాడ్మింటన్ అండర్ 17,14 బాలురు, బాలికల విభాగాలలో సుండుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్ కాగా, జి కె రాచపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ అండర్ 17,14 బాలుర విభాగంలో సుండుపల్లె విన్నర్స్, జికె రాచపల్లె విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో అండర్ 17 లో జికె రాచపల్లె విద్యార్థులు విన్నర్స్, సుండుపల్లె విద్యార్థులు రన్నర్స్‌గా ఎంపికయ్యారు. కబడ్డీ అండర్ 14లో విన్నర్స్‌గా జికె రాచపల్లె, రన్నర్స్‌గా తిమ్మసముద్రం విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ అండర్ 17లో విన్నర్స్ మడితాడు ఉర్దూ విద్యార్థులు, రన్నర్స్ తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు, అండర్ 14లో విన్నర్స్ సుండుపల్లె బాలురు,రన్నర్స్ గా తిమ్మసముద్రం తెలుగు విద్యార్థులు నిలిచారు. యోగ, చెస్ తో పాటు అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్,షాట్

పుట్, డిస్కస్ త్రో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ టోర్నమెంట్, సెలెక్షన్ లలో సుండుపల్లె ఉన్నత పాఠశాల, జికె రాచపల్లె, మడితాడు ఉర్దూ, తిమ్మసముద్రం, గుంతరాచపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాజంపేట డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు సుండుపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాఖీరా బేగం, ఎస్‌జిఎఫ్ఐ మండల కోఆర్డినేటర్, పిడి రాధారాణిలు తెలిపారు. పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్ర నాయక్, ఆంజనేయులు, మడితాడు, జికె రాచపల్లే, గుంతరాచపల్లె ఉపాధ్యాయులు ఆరిపుల్ల, వెంకటేశ్వరరెడ్డి విజయకుమార్ నాయక్, శ్రీరాములునాయక్, రామాంజనేయులురెడ్డి, పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల టౌన్‌లోని గాజుల్ల టీ స్టాల్ వద్ద మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో రోడ్డుపై బైఠాయించి వచ్చి పోయే వాహనాలకు అడ్డుపడుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న దొడ్డేటిపల్లి నాగేంద్ర ఆచారి అనే వ్యక్తిపై పోరుమామిళ్ల ఎస్ఐ ఆర్.వి.కొండారెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ బి.ఎన్. మూర్తి కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పేద కుటుంబాలను ఆదుకుంటాం

విశాలాంధ్ర -అట్లూరు: బద్వేల్ పట్టణం 33 వ వార్డులోని పేద కుటుంబాలను ఆదుకునేందుకు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని బద్వేల్ మున్సిపాలిటీ 33 వ వార్డు కౌన్సిలర్ మిత్తి కాయల సునీత యాదవ్, బద్వేల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి మిత్తి కాయల రమణ యాదవ్ లు అన్నారు. 33 వ వార్డు బంకపాలెం కేంద్రానికి చెందిన బాల వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మిత్తికాయల రమణ యాదవ్, సునీత యాదవ్ లు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త (ఇంచార్జ్) యువ నాయకుడు రితిష్ రెడ్డిల సహకారంతో మంగళవారం స్థానిక నేతలను పంపి బాధిత కుటుంబానికి రూ.5 వేలు సాయం చేశారు.

సంబేపల్లి ఎస్సైగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-సంబేపల్లె:సంబేపల్లె ఎస్సైగా రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సంబేపల్లె పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న భక్తవత్సలం తిరుపతికి బదిలీ అయ్యారు. రవికుమార్ గతంలో పుంగనూరు నియోజకవర్గం రామసముద్రం మండల ఎస్సైగా విధులను నిర్వర్తించారు. సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంబేపల్లె పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అటకెక్కిన తాగునీటి సోలార్ సిస్టం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన

విశాలాంధ్ర-సిద్ధవటం : తాగునీటి సమస్య పరిష్కారం కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు మండలంలోని సాయి నగర్ గ్రామంలో 20 కుటుంబాలకు గత కొన్ని రోజులుగా త్రాగునీరు రాక పంట పొలాల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడిందని మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొండయ్య మాట్లాడుతూ

సోలార్ సిస్టం పనిచేయక సాయి నగర్లో 20 గృహ నివాసాల ప్రజలకు త్రాగునీరు లభించక పంట పొలాల్లోకి వెళ్లి మహిళలు తెచ్చుకుంటున్నారని గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే లేరని ఓట్ల కోసం ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు త్రాగునీటి సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా సర్వోన్నత అధికారి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత మహిళలు పాల్గొన్నారు.త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా సోలార్ సిస్టం పనిచేయడం లేదని నా దృష్టికి రాలేదని త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

సూపర్ జీఎస్టీ,సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ

విశాలాంధ్ర-కడప : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్ టీ-సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ, సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యాశాఖధికారి డాక్టర్ కె. నాగరాజు మాట్లాడుచు జి.ఎస్. టి 2.0 సంస్కరణలు పేదలకు మరింత అందుబాటులోకి వైద్య సేవలు, వ్యక్తి గత ఆరోగ్య భవిత భీమా పాలసీ ప్రీమియంపై 18%నుండి పన్ను పూర్తిగా తగ్గించారన్నారు.ఈ రాలీని ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి సంధ్య సర్కిల్ వరకు సాగింది. ఈ ర్యాలీలో అసిస్టెంట్ కమిషనర్ అఫ్ సేల్ టాక్స్ ఆఫీసర్ పద్మావతి, డాక్టర్ శశిభూషనరెడ్డి, డాక్టర్ ఉమామహేశకుమార్, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ వెంకటాచంద్రారెడ్డి, ప్రోగ్రాఆఫీసర్స్, డెమో భారతి, మలేరియా అధికారి మనోరమ,సిబ్బంది పాల్గొన్నారు.

వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-చెన్నూరు : రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని అలాగే రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలని రైతులతో కలిసి రైతు సమస్యలపై ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ మంగళవారం జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు మండల రైతులు మేజర్ పంట అయిన వరి సాగుకు ఎక్కువ మొగ్గు చూపుతారని అటు బోరుబావుల కింద, ఇటు కేసి కెనాల్ కింద ఎక్కువగా వరి సాగు చేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాకు 2369 రూపాయలు ఉండగా దళారులు 80 కేజీలు బస్తా ధన్యాన్ని కేవలం 1150 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు గిట్టుబాటు దరలేక కుదేలవుతున్నారని ఆయన రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఖరీఫ్, రబీ సీజన్ల లోని రెండు పంటలకు మద్దతు ధర కల్పించి ఆదుకోవడం జరిగిందని ఇప్పుడు కూడా రైతులను ఆదుకోవాల్సిందిగా ఆయన కలెక్టర్ కు విన్నవించుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణారెడ్డి, గంగాధర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-సిద్దవటం : మండలం భాకరాపేట సమీపంలోని 11వ బెటాలి యన్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ మండలమీట్ క్రీడా ఎంపికలలో సిద్దవటం శ్రీసాయి హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో ఆటలతో ఉత్తమ ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు.అండర్ 17 కబడ్డీ పోటీ లలో పదవ తరగతి చదువుచున్న రాంచ రణ్, సాయి యశ్వంత్ ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో కబడ్డీలో 9వతరగతి మనోజ్, యశ్వంత్ రెడ్డి, 8వ తరగతి షేక్ సమీర్ ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో వాలీబాల్‌లో 10వ తరగతి గణేష్, మౌలాలి,సాయి యశ్వంత్, రాంచరణ్ ఎంపికయ్యారు, ఖోఖో బాలుర విభాగంలో కేశవకుమార్, అయూబ్, చెన్న కేశవ రెడ్డి, మోహన్, ప్రణయ్ కేశవ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, బాలికల విభాగంలో పల్లవి, సహస్ర,సాయి కీర్తన, హిమ వందన, సువర్ణ,స్వప్న,వైష్ణవి,శాన్వి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో సత్తా చాటి విజయకేతనం ఎగురవేసిన విద్యార్థినీ, విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ రేవతి దేవి, పాఠశాల ఇంచార్జ్ రాజేష్ అభినందించారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం : కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-రాయచోటి:వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సురేష్

కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి దామోదర్ రెడ్డి, స్టేట్ వాల్మీకి డైరెక్టర్ మండెం ప్రభాకర్, వాల్మీకి జిల్లా అధ్యక్షుడు యోగానంద, మదనపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్యామలమ్మ, జిల్లా వార్డెన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, వాల్మీకి కుల సంఘ పెద్దలు పాల్గొని మహర్షి వాల్మీకికి నివాళులు అర్పించారు.

నెట్ వర్క్ సమస్యతో సేవలకు ఆటంకం!

విశాలాంధ్ర-గాలివీడు : మండలంలోని గుర్రం వాండ్లపల్లి,చంద్రపురం, కమలామర్రి గ్రామాల ప్రజలు గత సంవత్సరం కాలంగా తీవ్ర నెట్‌వర్క్ సమస్యను ఎదుర్కొంటున్నారు.ఈ గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సంస్థ మూడు టవర్లను ఏర్పాటు చేసినప్పటికీ,అవి సరిగా పనిచేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.బీఎస్ఎన్ఎల్ బృందం పునరుద్ధరణ చర్యలు చేపట్టినా,రెండు రోజులకే సేవలు మళ్లీ నిలిచిపోతున్నాయని వారు వాపోతున్నారు.ప్రస్తుతం ఈ టవర్లు ఎయిర్-లింక్ మోడ్‌లో మాత్రమే పనిచేస్తున్నందున నెట్‌వర్క్ స్థిరంగా లేకపోవడంతో ప్రజలు నిరంతర కమ్యూనికేషన్ సౌకర్యం కోల్పోతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు అందుబాటులో లేని ఈ ప్రాంతాల్లో ప్రజలు పూర్తిగా బీఎస్ఎన్ఎల్ సేవలపైనే ఆధార పడుతున్నారు. తరచూ

కనెక్టివిటీ అంతరాయాలు ఏర్పడటంతో విద్యార్థులు, రైతులు,ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని,టవర్లకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ (ఓఎఫ్సీ) కల్పించాలని గ్రామ ప్రజలు బీఎస్ఎన్ఎల్ అధికారులను కోరుతున్నారు.

ప్రతి పాఠశాల దేవాలయంతో సమానం :చమర్తి జగన్‌మోహన్‌రాజు

విశాలాంధ్ర -రాజంపేట : పాఠశాలలు భవిష్యత్తు పునాదులు అని, ప్రతి పాఠశాలను దేవాలయంగా భావించి క్రమశిక్షణతో ముందుకు వెళితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంట్రల్ హాల్లో పూర్వపు విద్యార్థులచే నిర్వహించిన కమ్మ డిస్టిక్ బోర్డ్ హైస్కూల్ 91వ వార్షికోత్సవ వేడుకలకు చమర్తి జగన్మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు వార్షికోత్సవ వేడుకలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. 91 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్చుకునేందుకు నిలయంగా మారిన పాఠశాలలో తాను ముఖ్య అతిథిగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ప్రతి పూర్వపు విద్యార్థి వారు చదువుకున్న పాఠశాల విషయంలో చేయూతను అందిస్తే ప్రతి పాఠశాల మౌలిక వసతులతో అభివృద్ధి చెందుతుందని ఆయన తెలియజేశారు. పాఠశాలలను దేవాలయంగా, ఉపాధ్యాయులను దేవుళ్ళుగా భావిస్తే భవిష్యత్తులో అడగకుండానే వరాలు లభిస్తాయని, అందుకే ప్రతి విద్యార్థి తమ చదువుకున్న పాఠశాలతో పాటు గురువులను కూడా గౌరవించాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ఉపాధ్యాయ సిబ్బంది, స్టూడెంట్స్, పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలు కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్

విశాలాంధ్ర -రాజంపేట : రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీ అధ్యాపకులు "6వ గ్లోబల్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ - 2025" వివిధ విభాగాలలో ప్రతిష్మాత్మక అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ, కడపలోని కె.ఎస్.ఆర్.ఎం ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవార్డులను 2025 అక్టోబర్ 5న త్రిబుల్ ఐఐటి ఇడుపులపాయ డైరెక్టర్ ఏవిఎస్ఎస్. కుమార స్వామి గుప్తా చేత ప్రదానం చేశారు. బెస్ట్ టీచర్ అవార్డు విభాగంలో డాక్టర్ ఎం. పద్మ లలిత, (అవార్డు అందుకున్నారు. బెస్ట్ ప్లేస్‌మెంట్ టీచర్ అవార్డు విభాగంలో ఏ. సునీల్, విభాగాధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం, అన్నమాచార్య యూనివర్సిటీ అవార్డు లభించింది. బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అవార్డు విభాగంలో డాక్టర్ బి. నాగముని, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, అన్నమాచార్య యూనివర్సిటీ రాజంపేట సత్కరించబడ్డారు. బెస్ట్ ట్రైనర్ అవార్డు విభాగంలో ఎస్. పార్థ సారథి, అసిస్టెంట్ ప్రొఫెసర్, అన్నమాచార్య పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్ అవార్డు అందుకున్నారు. డాక్టర్ డి.జే.సమథా నాయుడును ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల బ్రాండ్ అంబాసదర్గా సత్కరించారు.ఈ విజయాల సందర్భంగా చాన్సలర్ డాక్టర్ సి. గంగిరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఈ. సాయి బాబా రెడ్డి, వైస్ ఛైర్మన్ సి. యెల్లా రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వీ. నారాయణ విజేతలందరినీ హృదయపూర్వకంగా అభినందించారు.

పశువుల సంతను రైతులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో ప్రతీ మంగళవారం జరిగే పశువుల సంతను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ ఛైర్మెన్ ఎస్.ఎం.డి. షఫీ నాయక్‌తో కలిసి ఆయన మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా జీవాల సంత, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ధరలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఛైర్మెన్ షఫీ నాయక్ ను కోరారు. అనంతరం మంత్రి సోదరుడు, నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిని ఛైర్మెన్ షఫీ నాయక్ గజమాలతో సత్కరించారు.

ముగిసిన శ్రీరాముడి వార్షిక పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర-వాల్మీకిపురం :తితిదే అధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీరాముడి వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా నాలుగో రోజు మంగళవారం

ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నిత్యసేవలు అనంతరం ఉదయం ఆలయ ప్రాంగణంలోని అస్థాన మండపంలో యాగశాల వైదిక కైంకర్య కార్యక్రమాల అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

కల్తీ మద్యం కేసును సిబిఐకి అప్పగించాలి : వైసీపీ

విశాలాంధ్ర- మదనపల్లె : మొలకలచెరువులో వెలుగు చూసిన కోట్లాది రూపాయల కల్తీ మద్యం కేసును సిబిఐ కి అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్ సి ఈశ్వర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతుం దన్నారు. ఇందుకు నిదర్శనమే మొలకలచెరువు మండల కేంద్రంలో కోట్లాది రూపాయల కల్తీ మద్యం వెలుగు చూసిందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ దాసరపల్లి జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కల్తీ మద్యం తయారవుతున్నా అతనికన్నా పెద్ద తలకాయ ఉందని వైసీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు నిజానిజాలు వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడే, దాసరిపల్లి జయచంద్రారెడ్డికి టిడిపి అభ్యర్థి గా బీ ఫారమ్ ఇచ్చారని గుర్తు చేశారు.ఈ సమావేశంలో వైసిపి నాయకులు నాగిరెడ్డి, సాంబ, సురేంద్రనాథ్, ప్రసాద్ రెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులు, ఖాదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే షాజహాన్ భాష

విశాలాంధ్ర -మదనపల్లె: నియోజకవర్గం పరిధిలోని నలుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే షాజహాన్ భాష మంగళవారం రూ. 2.5 లక్షల చెక్కులను స్వయంగా బాధితుల ఇంటికెళ్లి అందజేశారు. కొత్తవారిపల్లి పంచాయతీ నేతాజీ కాలనీకి చెందిన వెంకట సిద్ధారెడ్డికి 56 వేలు, లిఖిత్ కు 30 వేలు, గొల్లపల్లి హరిజనవాడ కు చెందిన లావేసుకు 45 వేలు, మిట్టపల్లి రేగంటి వారి పల్లి కి చెందిన జబ్బ ల సుధాకర్‌కు రూ. 73 వేల చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు ఐదు కోట్ల రూపాయలకు పైగా సీఎం ఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందించడం జరిగిందని అన్నారు.

ఆదిత్యలో ప్రాంగణంలో ఎంపికలు

విశాలాంధ్ర -మదనపల్లె: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో వి స్టాండ్ ఫర్ యు సొల్యూషన్ సమస్త చే ప్రాంగణ ఎంపిక లు నిర్వహించారు. ఈ ఎంపికల్లో వివిధ విభాగాల నుండి పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి వార్షిక వేతనం 3.5 లక్షలుగా సమస్త మేనేజర్ తేజ గౌడ్ ధ్రువీకరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టముతో కష్టపడి చదివి కానీ నా కలలను సహకారం చేసుకోవాలన్నారు. అవి సహకారమైనప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. కన్న తల్లిదండ్రులకే కాక కళాశాల కూడా గుర్తింపు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి రాముడు ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎంఆర్ సి మనోజ్ కుమార్ వివిధ శాఖధిపతులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మిట్స్‌లో రిసెర్చ్ ఆర్టికల్ రిట్రాక్షన్" పై అవగాహన

విశాలాంధ్ర -మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్శిటీ నందు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం వారు "రిసెర్చ్ ఆర్టికల్ రిట్రాక్షన్" పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్వైసర్ ఆర్-డి డాక్టర్ ఆర్. తులసి రామ్ నాయుడు మాట్లా డుతూ పరిశోధన పత్రాల ప్రచురణలో శాస్త్రీయ నైతికత, ప్రమాణాలు,పారదర్శకతకు సంబంధించిన అంశాలు ముఖ్య మన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వై.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థల నాణ్యత ప్రమాణాల దృష్ట్యా రీసెర్చ్ పేపర్స్ చాలా ముఖ్యమని, అధ్యాపకులు,విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ఆర్అండ్డి పి.శివయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

డివీఎంసీ చొరవతో స్మశాన వాటిక సమస్య పరిష్కారం

విశాలాంధ్ర -పీలేరు: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యుల చొరవ, తహసీల్దారు కృషితో దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న పీలేరు మండలం తలపుల పంచాయతీ హరిజనవాడ స్మశాన వాటిక సమస్య మంగళవారం పరిష్కారమైంది. గతంలో స్మశాన వాటిక కోసం తమ గ్రామానికి దూరంగా గుట్టల్లో స్థలాన్నికేటాయించారని, అక్కడకు చేరుకోవడమే కాకుండా అంత్యక్రియలు నిర్వహించేందుకు కష్టంగా ఉందంటూ హరిజనవాడ గ్రామస్తులు దశాబ్దాలుగా అధికారులను కోరుతున్నారు. అంతే కాకుండా ఆ విషయాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు బోదేశావలి, పాలకుంట శ్రీనివాసులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీలేరు రెవెన్యూ అధికారులు గత కొన్ని రోజులుగా స్మశాన వాటిక ఏర్పాటు కోసం తలపుల పరిసరాల్లో అనువైన స్థలం కోసం పరిశీలన జరిపారు. వారి శ్రమ ఫలించి హరిజనవాడ సమీపంలోనే, తలపుల యల్లమంద ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నెం.882లో 30 సెంట్ల ప్రభుత్వ స్థలం లభించింది. తహసీల్దారు శివకుమార్, డీవీఎంసీ సభ్యుడు బాదేశావలి, ఆర్ ఐ మురగయ్య, వీఆర్వో శ్రీనివాసులు, టిడిపి నేత అబ్బవరం అమరనాథరెడ్డి మంగళవారం తలపుల, హరిజనవాడతో చర్చించి వారిని ఒప్పించారు.

వాల్మీకుల ఎస్టీ జాబితా అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తాం :ఎమ్మెల్యే షాజహాన్ బాషా

విశాలాంధ్ర -మదనపల్లె : వాల్మీకుల చిరకాల స్వప్నం ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగే విధంగా చూస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రకటించారు. మంగళవారం పట్టణంలో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు అధ్యక్షతన వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకులను అభివృద్ధి వైపు నడిపించి వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తామన్నారు. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల్లో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉండగా ఇక్కడ మాత్రమే బిసిలుగా కొనసాగడంపైన వారి అభ్యంతరం సమంజసమైనదేనన్నారు. టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షికి మన ప్రాంతంలో చాలా చరిత్ర ఉందని, వాల్మీకి జయంతి దేశంలోని హిందువులందరికి పండుగ దినమన్నారు. పొదల నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి, అమలు చేయడంలో తీవ్ర జాప్యం తగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాగినేని రఘుపతి నాయుడు, మేకల విజయ్ మోహన్, పూల కుంట్ల హరిబాబు, బొగ్గిటి కృష్ణమూర్తి, టేకుపల్లి శ్రీనివాసులు, రాటకొండ మధు బాబు, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి, రాధమ్మ, బండి ఆనంద్, పిటియం శివ ప్రసాద్, పారపట్ల వేణు, తేజ, నాని, పెద్దపోడు చంద్రాయుడు, గౌరమ్మ, పార్వతమ్మ, నవీన్ చౌదరి, మాల మహానాడు యమల సుదర్శనం, గుండా రామచంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

దసరా బోనస్...దీపావళికేనా?

- తపాలా ఉద్యోగుల పెరుగుతున్న అసంతృప్తి
- కేంద్ర ప్రభుత్వా నిర్లక్ష్యంపై మండిపాటు

విశాలాంధ్ర -రాయచోటి: ప్రతి సంవత్సరం దసరా రాగానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ముఖాల్లో కనపడే చిరునవ్వు ఇప్పుడు ఆరిపోయింది. కారణం దసరా పండుగ బోనస్. అది రావాల్సిన సమయానికి రాకపోవడంతో ముఖ్యంగా తపాలా ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా జరగడం ఒక్కసారే కాదు. గత ఏడాది ఇదే పరిస్థితి. మంత్రిత్వ శాఖ సమీక్షలో ఉంది అంటూ చివరికి దీపావళి సమయానికి విడుదల చేస్తూ వస్తోంది. ఈ తరహా వ్యవహారం పట్ల ఉద్యోగుల్లో ఆగ్రహం పెరుగుతుంది.అది వారి కుటుంబాలకు పండుగ సంతోషం తెచ్చిపెడుతుంది. కానీ ఈ సంతోషం సంవత్సరాలుగా వాయిదా పడుతోంది. దసరా పండుగ వచ్చి పోయిన బోనస్ ఫైలు మాత్రం మంత్రిత్వ శాఖలోనే తిరుగుతోంది. పండుగకు రావాల్సిన బోనస్ పండుగ పోయాక వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరేమో దసరా బోనస్ వచ్చేదేమో దీపావళికి అంటూ వ్యంగంగా మారింది. తపాలా ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలమాలు వేడుకున్న వ్యవహారం మాత్రం మారలేదు. ఈ ఏడాది కూడా దసరా ముగిసినా బోనస్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం దసరాకు ముందే బోనస్ ఇచ్చి సంతోష పెట్టలేకపోతోందని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆనందానికి ప్రతీకలు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ సమాజంలో భాగమే. వారి కృషి కుటుంబాల సంతోషం కూడా ప్రభుత్వ బాధ్యతతో భాగమే. వారి సేవలకు ఇచ్చే గౌరవం దానిని సమయానికి ఇవ్వడం ప్రభుత్వ న్యాయబద్ధమైన బాధ్యత. ప్రతి ఏడాది బోన సాలస్యం అవుతూనే ఉంది.తపాలా శాఖ ఉద్యోగులు సమయానికి బోనస్ పొందే హక్కు కలవారు. ఇకనైనా కేంద్రం ఉద్యోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించకుండా దసరాకు అందించే బోనస్ అందించి వారి కళ్ళల్లో సంతోషం నింపాలి.

నవోదయకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర- మదనపల్లె : జవహార్ నవోదయ పాఠశాలలో 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి, 11వ తరగతిలో చేరగోరు విద్యార్థులు అక్టోబర్ 21 లోగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పూర్తిగా ఉచితం అని తెలిపారు. ఈ సదవకాశాన్ని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, ఎస్సీఎస్టీ విద్యార్థులు, పేద విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర -వాల్మీకిపురం : మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, కుందేళ్లవాళ్లపల్లె తదితర ప్రాంతాల్లో మంగళవారం వాల్మీకి జయంతోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తొలత వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకిపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలో 8 అడుగుల వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆ సంఘం నాయకులు ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం, చింతపర్తి, కుందేళ్లవాళ్లపల్లె వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూతనఈఓనుసన్మానించినపీలేరుసర్పంచ్, వార్డు సభ్యులు

విశాలాంధ్ర -పీలేరు: నూతనఈఓబ్రహ్మానందరెడ్డినిపీలేరుసర్పంచ్, హబీబ్ బాషా,వార్డు సభ్యులు సంయుక్తంగా కలసి సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ హబీబ్ బాషా మాట్లాడుతు పీలేరు పంచాయతీ అభిరుద్ధికితమవంతు కృషి చేస్తు, గ్రీవెన్స్ డే లో వచ్చినసమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఈఓను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్ బాషా తో పాటు వార్డు సభ్యులుఉదయ్, నాగభూషన్,మల్లికార్జున రెడ్డి,సాంబ శివ రెడ్డి,అభిద్,కాలేషా,సచిన్, విక్టరీ వెంకట రమణ రెడ్డి,శ్రీనాథ్ రెడ్డి, పీక్క రమణ, ఫర్మాష్, షాజహాన్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీల మందుల పిచ్చకారితో నష్టపోయిన రైతు

విశాలాంధ్ర -వాల్మీకిపురం : మండలంలో అయ్యవారిపల్లెకు చెందిన బొప్పాయి రైతు కె.శివశంకర్ తన రెండుఎకరాల పొలంలో దాదాపు రూ.2 లక్షలుదాక అప్పులు చేసి బొప్పాయి తోట సాగు చేశాడు. ఇటీవల ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధి అంటూ వచ్చి తమ కంపెనీ మందులను వాడాలని, మంచి దిగుబడి వస్తుందని సూచించి కొన్ని మందులను రైతు శివశంకరకు ఇచ్చాడు. అయితే రైతు మంచి దిగుబడి వస్తుందని ఆశపడి ఆ కంపెనీ ప్రతినిధికి డబ్బులు చెల్లించి ఆ మందులను తీసుకుని రైతు తన బొప్పాయి తోటకు పీచకారీ చేయడంతో తోట మొత్తం ఎర్రగా తిరిగిపోయి కాలిపోయింది మందుల పిచకారీ వల్ల తన బొప్పాయి తోట దెబ్బతినిందని బాధిత రైతు కంపెనీ ప్రతినిధికి ఫోన్చేస్తే అతను ఫోన్ లిఫ్టుచేయడం లేదని రైతు లబోదిబోమంటున్నాడు. తనను ప్రభుత్వమే అదుకోవాలని కోరుతున్నాడు.

భావితరాలకు ఆదర్శనీయులు మహర్షి వాల్మీకి .. డిఆర్ఓ ఎం. విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : భారతీయ ఇతిహాసాన్ని, మానవ సంబంధాలు, కుటుంబ విలువల సారాంశాన్ని అపురూపమైన రామాయణ గ్రంథంగా సమాజానికి అందించిన 'వాల్మీకి మహర్షి' భావితరాలకు ఆదర్శనీయం అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. ఆశ్వీయుజ శుద్ధపౌర్ణమి అయిన మంగళవారం.. కడప కలెక్టరేట్ వుర్నిపిజిఆర్ఎస్ హాలులో జిల్లా బీసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు తోపాటు రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ

యాదవ్, ఎస్డీసి వెంకటపతి, జిల్లా బీసీ కార్పోరేషన్ ఈడి జయసింహ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల హాజరయ్యారు. డిఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ.. భారతీయ చరిత్రలో సంస్కృత భాషలో పద్యాల రచన రామాయణంతోనే మొదలయ్యిందని.. ఆ ఘనత ఒక్క వాల్మీకి మహర్షికే దక్కుతుందన్నారు. సంస్కృతంలో పద్యాలు రాసిన తొలికవి కూడా.. ఆ మహానేయులేనన్నారు. వాల్మీకి చరితం గురించి డిఆర్వో వివరించారు. రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. అకుంఠిత దీక్ష, పట్టుదల, ఏకాగ్రతకు నిలువెత్తు నిదర్శనం వాల్మీకి మహర్షి అన్నారు. ఆయన జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ కులసంఘాల నాయకులు, ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే ఆది, టీడీపి నేత భూపేష్

విశాలాంధ్ర-మైలవరం : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఇంచార్జి భూపేష్ రెడ్డిలు అన్నారు. మంగళవారం అంబవరం గ్రామంలో గోకులం షెడ్ నిర్మాణానికీ ఎమ్మెల్యే , టీడీపి ఇంచార్జ్ భూపేష్‌లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు పశు పోషణలో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టి రెండవసారి కొత్త వాటి నిర్మాణానికి అవకాశం కల్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎపిడి, ఏపీఓ పద్మారాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, నాయకులు అంబవరం రామయ్య, సర్పంచ్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి :ఎమ్మెల్యే ఆది, టీడీపి నేత భూపేష్

విశాలాంధ్ర-మైలవరం : వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, భూపేష్ రెడ్డి లు అన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే, భూపేష్ రెడ్డి లు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భం

గా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రాసిన రామాయణం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అని, అన్నదమ్ముల బంధం, నమ్మకం, పెద్దల మాటకు విలువలు వంటివి రామాయణం వివరిస్తుందన్నారు. వాల్మీకి మహర్షి కుటుంబానికి చెందిన వాల్మీకులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తో పాటు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి భూపేష్ సుబ్బరామి రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వాల్మీకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సనాతన సూత్రధారుల నిగ్గు తేల్చాలి : కాంగ్రెస్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : దేశ అత్యున్నత న్యాయస్థానం ముఖ్య న్యాయ అధికారి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై రాకేష్ అనే న్యాయవాది దాడికి యత్నించిన ఘోర ఉదంతంలో నిజ మైన సూత్రధారులు ఎవరన్నది నిగ్గు తేల్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత అమానవీయ మైన ఈ ఈ ఘటన భారతదేశ న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా విమర్శించారు. ఇటీవల చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ బీహార్ తల్లినీ రాష్ట్రీయ స్వయంసేవక్ శత దినోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించగా ఆమె తిరస్కరించారు. ఈ నేప థ్యంలో సిబిఐపై ఈ దాడికి ప్రయత్నించడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా సెల్ అధ్యక్షుడు మాయా నరహమతుల్లా ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మండల సమావేశంలో సమీక్ష

విశాలాంధ్ర-పెద్దమండ్యం : మండలంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని వారి శాఖలో ప్రభుత్వం ద్వారా అమలు కావలసిన పనుల గురించి చర్చించారు. ముఖ్యంగా మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు మాట్లా డుతూ ప్రభుత్వం ద్వారా అందుతున్న సబ్సిడీ పరికరాలు రైతులకు జీఎస్టీ తగ్గించి నాణ్యమైన పరికరాలను అందజేస్తామన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు రేషన్ షాపుల ద్వారా వృద్ధులకు వికలాంగులకు రేషన్ తమ ఇంటి వద్దకే పంపిణీ చేయడంలో విఫలమయ్యారని దాని ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలిచర్ల పంచాయతీలోని రేషన్ షాపుల ద్వారా ఆ పంచా యతీలోని గ్రామాలకు రేషన్ డీలర్లు వెళ్లడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ అండ్ బి రోడ్లు మొత్తం గుంతలమయమయ్యాయని వాటికి మరమ్మ తులు చేయాలని అలాగే బస్టాండ్‌లో ట్రాన్స్ఫారంను మార్చి వేరేచోట అమర్చాలని ఆయన విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ జెడ్పిటిసి వీరమ్మదర్ స్వామి ఏపీఓ సురేందర్ రెడ్డి ఎంఈఓ రామకృష్ణ సిడిపిఓ సుజాత, పెద్దమండెం సర్పంచ్ భాష, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని గోపనపల్లి నల్లబత్తిన వాండ్లపల్లె వాసి రాజుపాలెం నాగయ్య (74) తన తమ్ముడు సుబ్బారాయుడును కత్తితో హత్య చేసిన కేసులో జీవిత ఖైదును విసిస్తూ

రాయచోటి కోర్టు తీర్పు వెలువరించింది. 2022 జూన్ 14న మల్లేశ్వరస్వామి మొక్కుబడి సందర్భంలో తోటిగాండిమడుగు వద్ద మేక నరికే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసు కుంది. ఆ తరువాత నాగయ్య ఊరికి వెళ్లి, సాయంత్రం 5 గంటల సమయంలో తమ్ముడు సుబ్బారాయుడుపై వేట కొడవలితో దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై గాలివీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు.మంగళవారం రాయచోటి వి అదనపు జిల్లా సెషన్స్ జడ్జిఎస్.కృష్ణన్ కుట్టి ఆధ్వర్యంలో విచారణ జరిపి, నిందితుడు నాగయ్యకు 326 ఐపీసీ కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా, 302 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

రాచపల్లి కాజ్వే తాత్కాలిక మరమ్మత్తులు

విశాలాంధ్ర - సుండుపల్లె : మండలం పెద్దినేనికాలువ పంచాయతీ రాచపల్లి దిగువలో ఉన్న కాజ్వే చిన్నబిడికి వెళ్లేందుకు వరద నీటికి మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో చిన్నబిడికి వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ దేరేంగుల సిద్దులయ్య ఆర్థిక సహాయంతో మంగళవారం మట్టితో తాత్కాలిక మరమ్మత్తులు చేయించారు.

భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరపాలి

సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గం కార్యదర్శి ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురయ్యాయని వాటిపైన సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గం కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు మంగళవారం నాడు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి శ్రీ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చాలాచోట్ల మున్సిపాల్ స్థలాలు కబ్జా గురై కబ్జాదారులు షాపులు కట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారని. మున్సిపాలిటీకి పన్ను చెల్లించకుండా దోపిడీ చేస్తున్నారని వారన్నారు మే మాసంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా ఆర్డీవో నివేదిక ఇవ్వమని పంపగా ఫిర్యాదు చేసిన సిపిఐ నాయకులకు ఎండార్స్మెంట్ ఇచ్చి ఐదు నెలల గడుస్తున్నా ఇంతవరకు భూకబ్జాలపైన మున్సిపల్ అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడం వెనుక

అంతర్యం ఏమిటో అని వారు అన్నారు. వెంటనే కబ్జా అయిన స్థలాల పైన ఆర్డీవో గారు ప్రత్యక్షంగా విచారించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్ సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు నాగేంద్ర సంతోష్ సుభాన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-గాలివీడు : 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 8, 9, 10 తేదీలలో గాలివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మం డల కోఆర్డినేటర్ గంగరాజు,ప్రధానోపాధ్యాలు జాఫర్ తెలిపారు.ఈ పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లె టిక్స్ వంటి విభాగాలలో అండర్-14, అండర్-17 వయో విభాగాల విద్యార్థులు పాల్గొననున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠ శాలల విద్యార్థి, విద్యార్థినుల కోసం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి,ఆరోగ్య పరి రక్షణ, జట్టు సహకార భావనను పెంపొందించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు.

తనిఖీల్లో ఎలాంటి అక్రమ నిల్వలు దొరకలేదు:ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ వెంకటరెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు : పట్టణం లోని చక్కవాండ్లపల్లె రైస్ మిల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఎలాంటి అక్రమ నిల్వలు దొరక లేదని ఎన్ఫోర్స్మెంట్ డీటీ వెంకట్రెడ్డి,

వీఆర్వో రవీంద్రా రెడ్డి ధృవీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి తనిఖీల నిమిత్తం రైస్ మిల్ వద్ద వెళ్లగా, నిర్వాహకులు ఎవ్వరూ లేకపోవడంతో మంగళవారం ఉదయం మిల్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు.అయితే ఈ దాడుల్లో ఎలాంటి ఆక్రమ బియ్యం నిల్వలు దొరకలేదని వారు తేల్చారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనడం,అమ్మడం నేరమని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తనిఖీలో భాగం గా ఆయన వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఖతర్‌లో గాలివీడు వాసి మృతి

విశాలాంధ్ర-గాలివీడు : బతుకు తెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన పఠాన్ ఫయాజ్ (29) గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.స్థానికుల కథ నం మేరకు గాలివీడు పట్టణం గేటు నాలుగురోడ్ల కూడలి వద్ద నివాసం వుంటున్న అజీజ్ ఖాన్ కుమారుడు పఠాన్ ఫయాజ్ బతుకు దెరువు కోసం ఖతర్ వెళ్లాడు.అయితే హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఫయాజ్ మృతి చెందినట్లుగా సమాచారం రావడంతో ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్న వయసులోనే తమ బిడ్డ దూరమవ్వడం జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర -వల్లూరు : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ బైపిసి రెండో సంవత్సరం చదువుతున్న అనూష అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ నాజీ మునిషా అన్నారు. మంగళవారం మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన

జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో అనూష హై జంప్ లో మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థిని అనూష రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు మాకు చాలా గర్వంగా ఉందని విద్యార్థిని పాఠశాల పిడి రూటు కళాశాల సిబ్బంది అనూషను అభినందించారు.

ఇద్దరు శ్రీగంధం స్మగ్లర్లు అరెస్ట్ : ఎఫ్‌బిఓ

రూ.35 వేల విలువైన 10 కిలోల శ్రీ గంధం సీజ్

విశాలాంధ్ర-బి.కొత్తకోట : అన్నమయ్యజిల్లాలోని బి కొత్తకోటమండలంలో శ్రీగం ధం చెట్లను నరికి అక్ర మంగా కర్ణాటకకు తరలి స్తున్న ఇద్దరిని మంగళవారం ఫారెస్ట్ అధికారులు అరెస్టు చేశారు. మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారి జయ

ప్రదరావు వివరాలను వెల్లడించారు. బి.కొత్తకోట మండలం, మొగసాల మర్రికి చెందిన శ్రీనివాసులు 50, తంబళ్లపల్లె మండలం, ఇట్నేని వారిపల్లికి చెందిన టి.శివకుమార్ 23లు శ్రీగంధం చెట్లను వ్యవ సాయ పొలాల వద్ద నరికి, 10 కిలోలను పోగుచేసి పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు. హార్సిలీ హిల్స్ ఎఫ్ఎస్ఓ శివకుమార్, ఎఫ్‌బిఓ జయ రాం, సుమిత, దేవేంద్రలు వెళ్లి పథకం ప్రకారం నిందితులను అదుపులోకి తీసుకొని శ్రీగంధం సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

శ్రీ కనుమ పోలేరమ్మ రథోత్సవం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ రథోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయం అర్చకులు,ప్రసాద్ పూజారి, మిథున్, చిన్న సుబ్బారాయుడు, గురు ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-బద్వేలు: నియోజకవర్గ పరిధి లోని గోపవరం మండలం బేతయపల్లె పంచాయతీలో మండలవ్యవసాయ అధికారి విజయరావు ఆధ్వర్యంలో కడప రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారిణి పద్మజ మట్టి నమూనాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో రైతులు మట్టి నమూనాలు జిగ్ జాగ్ పద్ధతిలో 'వి' ఆకారంలో 12-15 సెంటిమీటర్ లోతులో ఛరఐను బరికి నమూనాలు సేకరించాలి అదేవిధంగా మీ భూమిలో కొన్ని పోషకాలు ఉంటాయి అవి కాకుండా ఎరువులు వాడితే పెట్టుబడి తగ్గించుకొని ఆదాయం పెంచుకునే దిశగా ఉంటుంది కాబట్టి ప్రతి రైతు మట్టి నమూనాలను చేపించు కోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వ్యసాయవిస్తరణ అధికారి ఓబయ్య, వీఏఏ సుప్రియ, సర్పంచ్ వెంకటేశ్వర్లు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఏపీఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్ రెడ్డి, మండల టిడిపి ఇన్చార్జ్ యనమల మదన్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, నాయకులు ఆరీఫ్, విజయ భాస్కర్, లక్ష్మీ నారాయణ, కృష్ణ, రామాంజనేయులు, విశ్వనాథ్, మసూద్, ఓబులేసు, ముక్తార్ అహ్మద్, మూగి వెంకటరమణ, పక్కీరయ్య, శ్రీను, అన్వర్, వీరభద్ర పాల్గొన్నారు.

కౌలు రైతు వరి వర్షార్పణం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామంలోని దరిమిశెట్టి వెంకటేశ్వర్లు రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, కుటుంబ పోషణ కోసం వరి పంట సాగు చేసాడు. రైతన్న చేతికి వచ్చిన పంట రాత్రి అనగా సోమవారం రాత్రి కురిసిన వర్షం,గాలి కారణంగా వరి పంటనేలకు పడిపోవడంతో బాధలో రైతన్న అప్పోసొప్పో వడ్డీల కోపణం తెచ్చుకొని వరి పంటకు సాగు ఖర్చు చేయడంతో అకాల వర్షానికి నష్టం జరిగిందని ప్రభుత్వం కష్టపరహారం చెల్లించాలని స్థానిక శాసనసభ్యులు రైతులను ఆదుకోవాలని రైతు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి వారిని ఆదుకునే విధంగా చూడాలని లేనిపక్షంలో కుటుంబ సభ్యులందరూ ఆత్మహత్య శరణమని రైతు ఆందోళన వ్యక్తం చేశారు.

రాయలసీమ ప్రాంత వాసులకు వరం కడప మానసిక వైద్యశాల

- ఈనెల 4 నుంచి 10 వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు
- కడప ఐఎంహెచ్ సూపర్డెంట్ డాక్టర్ ఆర్ వెంకట్ రాముడు

విశాలాంధ్ర-కడప: రాష్ట్రంలో రాయలసీమ ప్రాంత వాసులకు ఏడాదిన్నర క్రితం నుంచి అందుబాటులోకి వచ్చిన కడప మానసిక వైద్యశాల వరంగా భావించాలని కడప ఐఎంహెచ్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్) హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ ఆర్ వెంకట్రాముడు తెలియజేశారు. రిమ్స్ ఆవరణంలోని వంద పడకల మానసిక వైద్యశాల ఏడాదిన్నర క్రితం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈనెల 4వ తేదీ నుంచి పదవ తేదీ వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను ఐఎంహెచ్ లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఐఎంహెచ్ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో మానసిక ఆరోగ్య విషయాలను సూపరింటెంట్ డాక్టర్ వెంకట రాముడు వివరించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను ప్రతి ఏడాది సాంప్రదాయంగా నిర్వహిస్తున్నామన్నారు. 50 సంవత్సరాల కిందట వైజాగ్ లో ఏర్పాటు చేయబడిన మానసిక వైద్యశాల తర్వాత ఏడాదిన్నర క్రితం కడప రిమ్స్ ఆవరణలో ప్రారంభించబడిన ఐఎంహెచ్ లో మానసిక వైద్య సేవలను ప్రత్యేకంగా అందిస్తున్నామన్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లను దాదాపు పదివేల ను అర్హులైన వారికి అందించామన్నారు. ప్రతిరోజు 150 నుంచి 200 మంది ఓపీ సేవలను అందుకుంటున్నారని, ప్రతి నెల 80 నుంచి 100 మంది ఐపీ సేవలు పొందుతున్నారన్నారు. 4,000 మందికి ఇప్పటికే కరెంట్ షాక్ ద్వారా ట్రీట్మెంట్ ను అందించగలిగామన్నారు. మందులు విభాగం, ల్యాబ్ విభాగం అందుబాటులో ఉందన్నారు. కేవలం సిటీ స్కాను, ఎమ్మారై స్కాన్ల కోసం జిజిహెచ్ కు రోగులను పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల పట్ల అపార గౌరవం

- టిడిపి నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ మహిళల పట్ల అపార గౌరవం కలిగి ఉంటుందని ఆ పార్టీ నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతల గత చరిత్రను ఒకసారి పరిశీలిస్తే వారు మహిళల పట్ల అనుసరించిన వైఖరి ఏమిటన్నది తెలుస్తుందన్నారు. కడప నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజా జీవితంలో ఉన్న మాధవీరెడ్డిని అగౌరవపరుస్తూ సోషల్ మీడియా వేదికగా దేశ ప్రజలు చూసేలా వ్యవహరించిన వ్యక్తి పారిపోయే పరిస్థితుల్లోనే పోలీసులు అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారన్నారు. గత చరిత్రను పరిశీలిస్తే సీఏఏ, ఎన్ఆర్సీ చట్టం ఉపసంహరణ సందర్భంగా చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న మహిళలను వైసిపి నేతలు బజారు మహిళలు అని సంబోధించిన అంశాన్ని ఇంకా ఎవరూ మరిచిపోలేదన్నారు. తొలినుంచి వైసిపి మహిళలకు తగిన గౌరవ మర్యాదలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎవరు ఎంత స్థాయిలో ఉన్నా ఆడవారిని కించపరిస్తే తక్షణ చర్యలు ఉంటాయన్నారు. వైసీపీ నాయకులను దేవుడు కూడా ఉపేక్షించడని తెలిపారు. టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడేముందు గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. శ్రీనివాసరెడ్డి పుట్టి పెరిగింది, రాజకీయాలు చేస్తున్నది కడపలోనే అన్న విషయాన్ని వైసిపి నేతలు తెలుసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జిలాని బాష, పలువురు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్చే గోల్డ్మెడల్

- అంకాల శైలజకు అభినందనలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), కడపలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని అంకాల శైలజ (ఎం.కామ్ 2022-24 బ్యాచ్) తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థిని ప్రతిభను అభినందించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బయ్యపురెడ్డి కూడా సంతోషం వ్యక్తం చేసి, అంకాల శైలజకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీని వరించిన మూడు అవార్డులు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: స్వచ్ఛ ఆంధ్ర అవార్డు - 2025 జిల్లా అవార్డు కార్యక్రమంలో రంగసముద్రం పంచాయతీకి మూడు అవార్డులు రావడం జరిగింది. జిల్లా ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రంగసముద్రం పంచాయతీ తరపున సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి విలేజ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి, జిల్లా ఉత్తమ హరిత రాయబారిగా మణిరత్నం, జిల్లా ఉత్తమ స్వచ్ఛ అంగన్వాడి కేంద్రం విజయ జ్యోతికి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ప్రభుత్వ విప్ జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 16 కేటగిరీలలో 48 మందికి ఈ అవార్డు ప్రధానం చేయడం జరిగిందని అందులో రంగసముద్రం పంచాయతీకి మూడు అవార్డులు రావడం అన్నది పంచాయతీకి గర్వకారణం అని, రంగసముద్రం పంచాయతీకి స్వచ్ఛ రంగ సముద్రం అవార్డు రావడానికి పంచాయతీ కార్యదర్శులు రాజీవ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, భాస్కర్ బాబు, రాజేశ్వరి గతంలో పనిచేసిన ఈఓపిఆర్డి రమణారెడ్డిల అంకితభావంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల కష్టం ఎంతో ఉందని ఈ అవార్డును వారికి అంకితమిస్తున్నట్లు తెలియజేశారు. ఈ అవార్డు బాధ్యతతో ఇంకా రంగసముద్రాన్ని స్వచ్ఛతగా ఉంచడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఇంకా బాగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, మండల అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి, యువ నాయకులు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు వరి పొలాలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా

విశాలాంధ్ర-సుండుపల్లి: మండలంలోని మడితాడు, బెస్తపల్లి, తిమ్మసముద్రం, వై.యన్.పాలెం గ్రామంలో వరి పొలాలను జిల్లా వనరుల కేంద్రం అధికారులు, వ్యవసాయ అధికారి రామకృష్ణ రాజు, మండల వ్యవసాయ అధికారులతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలోకి పరిశీలించారు. ఇందులో భాగంగా వరి పంటలో అగ్గి తెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగినది.దీని యొక్క ఉధృతిని తగ్గించుట కొరకు రైతు సోదరులు సస్యరక్షణ చర్యలను వరి పొలాలలో తక్షణమే పాటించాలని రైతులకు తెలియపరచడం జరిగింది. ముఖ్యంగా కాలిబాటలు వరి పొలాలలో తీయాలని సూచిం చారు. దీని ద్వారా గాలి, వెలుతురు బాగా తగిలి దోమ ఉధృతి తగ్గడం జరుగుతుంది. ఆ తర్వాత వరిమడులలో నీటిని పూర్తిగా తీసివేసి కొద్దిగా ఆరబెట్టేటట్లు చేయాలి. యూరియా పూర్తిగా వాడరాదు. అధికారులు సూచించిన మేరకే పురుగుమందులను పిచికారి చేయాలి. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణ రాజు,మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆర్ఎస్కే సిబ్బంది ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

భాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ అండ



విశాలాంధ్ర-రైల్వేకోడూరు: సిఎం రిలీఫ్ ఫండ్ భాదిత కుటుంబాలకు పెద్ద అండ అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి తనయులు యువ నాయకులు ముక్కా సాయివికాస్ రెడ్డి పేర్కొన్నారు. పెనగలూరు మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన కోడూరు నీరజ కు మంజూరైన 1,25,373 రూపాయల చెక్ ను తీసుకుని స్వయంగా బాధితురాలి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి చెక్ ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేసిందన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ప్రధానమైనది

విశాలాంధ్ర-కడప: విద్యార్థి సంపూర్ణ అభివృద్ధి చెందాలంటే మంచి విద్యావంతుడు కావాలంటే మానసిక ఆరోగ్యం ఉండాలంటే ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యమైనవని కడప జిల్లా ఏపీసి నిత్యానంద రాజులు తెలియజేశారు. జిల్లా జిసిడిఓ దార్ల రూతు ఆరోగ్య మేరి చింతకొమ్మలదిన్నె మండల హెడ్ క్వార్టర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన "మానసిక ఆరోగ్యం- ఆహారపు అలవాట్లు" కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. కౌన్సిలర్లు డా. శిల్ప, డా.నాగభూషణం, ఏఎంఓ వీరేంద్ర, ఎఎస్ఓ సంజీవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు గంగాధర్, ఉమామహేశ్వరి, గురవయ్య పాల్గొన్నారు.